ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి

ఆర్మూర్, బతుకమ్మ :ప్రభుత్వం కల్లాల్లో ఉన్న మక్కలు, వడ్లు వెంటనే కొనాలి అని అన్నందుకు ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను ఉద్యోగం నుండి తొలగించాలని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను ప్రస్తావించినందుకు ఒక సాధారణ ఆర్టీసీ డ్రైవర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమ న్నారు. రైతులు పండించిన పంటలను వెంటనే కొనుగోలు చేయాలని కోరడం తప్పు కాదని, ప్రజల సమస్యలను ప్రశ్నించే వారిపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. వెంటనే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని, ఆయనపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తే ఉద్యోగాలు తొలగించే ఈ నియంతృత్వపు కాంగ్రెస్ పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

కాలిపోయిన 15 కె.వి. డీటీఆర్‌ను
రాత్రికి రాత్రే మార్చించిన సర్పంచ్

జుక్కల్ , బతుకమ్మ :జుక్కల్ మండలంలోని బస్సాపూర్ గ్రామంలో ఇందిరమ్మ కాలనీ బస్సాండ్ సమీపంలో ఉన్న 15 కె.వి. డీటీఆర్ (ట్రాన్స్ ఫార్మర్) కాలిపోవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ రమణ సురేష్ గొండ వెంటనే గ్రామ లైన్‌మన్ కె. మారుతికి తెలియజేశారు. సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్ చర్యలు తీసుకుని కొత్త 15 కె.వి. డీటీఆర్‌ను తెప్పించి, చీకటి అయినప్పటికి రాత్రి 8 గంటల సమయంలో విద్యుత్ శాఖ సిబ్బందిని పిలిపించి ట్రాన్స్ ఫార్మర్ మార్పిడి పనులు చేపట్టించారు. సర్పంచ్ రమణ సురేష్ గొండ స్వయంగా అక్కడే ఉండి పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కారోబారి ఎం. గంగారం, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బి. రాజు, గోపాలమిత్ర వాలంటరీ రాములు, గ్రామ విద్యుత్ వర్కర్ ముంచేవారు, దత్తరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించడంతో సర్పంచ్‌ని, డ్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంధన ధరల పెంపుదలపై ఆటోకు తాడు కట్టి లాగి వినూత్న నిరసన

నిజామాబాద్ సిటి, బతుకమ్మ:పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ ఎస్ పి)ఆధ్వర్యంలో ఆటోకు తాడు కట్టి లాగుతూ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద ఆర్ఎస్ పి నిరసన నిర్వహించిన సందర్భంగా ఆర్ఎస్పీ జిల్లా కన్వీనర్ కటారి రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా పెట్రోల్‌పై రూ.2.62, డీజిల్‌పై రూ.2.71 పెంచడమే కాకుండా, గత పది రోజుల వ్యవధిలోనే పెట్రోల్‌పై మొత్తం రూ.8.23, డీజిల్‌పై రూ.8.12 వరకు ధరలు పెంచడం ప్రజలపై తీవ్రమైన భారంగా మారిందన్నారు. దేశంలో ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో ఇంధన ధరల పెంపు కారణంగా రవాణా రంగం పూర్తిగా దెబ్బతింటోందన్నారు. ముఖ్యంగా ఆటో కార్మికులు, చిన్న వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో నడిపే కార్మికులకు వచ్చే ఆదాయం మొత్తం పెట్రోల్, డీజిల్ ఖర్చులకే సరిపోతుందని, కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే ప్రజలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, గోపాల్ సింగ్ ఠాగూర్, సునిల్, ఆటో కార్మికులు నిజాముద్దీన్, పందరి, ఇర్ఫాన్, హైమద్, కృష్ణ, అక్రమ్ ఖాన్, జవిద్, కిషన్, శీను, సర్యపల్ ముజు, అశ్రఫ్, నంద నాయి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ వాణిజ్యాన్ని అందిపుచ్చుకునేలా రైతులకు తోడ్పాటును అందించాలి

వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అధికారులను కోరిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

కలెక్టరేట్‌లో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లా రైతాంగానికి మరింత ప్రయోజనం కలిగేలా వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ద్వారా తోడ్పాటును అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను కోరారు. జిల్లా రైతాంగం తమ వ్యవసాయ ఉత్పత్తులను దేశ, విదేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్యపరంగా వారికి అనుసంధానం ఏర్పరచాలని అభిలషించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ(డి.జి.ఎఫ్.టీ), ఎ.పీ.ఈ.డి.ఎ, జాతీయ పసుపు బోర్డు, నాబార్డు, ఇండియా పోస్ట్ ల సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమం నిర్వహించారు. నూతన ఎగుమతిదారులను ప్రోత్సహించడం, ఎం.ఎస్.ఎం.ఈల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, జిల్లాల స్థాయిలో ఎగుమతులను గణనీయంగా పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ-కామర్స్ ఎగుమతుల ప్రదర్శన, ట్రేడ్ కనెక్ట్ పోర్టల్, పసుపు, వరి, సోయాబీన్, మొక్కజొన్న, పత్తి తదితర పంటల మార్కెట్ వైవిధ్యీకరణ అంశాలపై డి.జి.ఎఫ్.టీ అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు విచ్చేసి, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే పంటల సాగు, సస్య రక్షణ చర్యలు, పంట ఉత్పత్తుల మార్కెటింగ్, విదేశాలకు ఎగుమతులు, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం, సాగు నీటి యాజమాన్య పద్ధతులు తదితర అంశాల గురించి వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లా రైతాంగం సేద్యపు రంగంలో ఆధునిక విధానాలు, శాస్త్రీయ పద్ధతులను అవలంభిస్తూ ఆదర్శ రైతులుగా పేరు పొందారని అన్నారు. ముఖ్యంగా ఆర్మూర్ ప్రాంత రైతులు అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేస్తారని, వ్యవసాయ ఉత్పత్తులు, నూతన వంగడాల విషయంలో అంకాపూర్ ప్రాంత రైతులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా రైతాంగానికి ఆధునిక పద్ధతులలో పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ, విదేశీ వాణిజ్యంతో అనుసంధానం కలిగిస్తే ఈ ప్రాంత రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ ఆకాంక్షించారు. పురాతన, సంప్రదాయ పద్ధతుల స్థానంలో ఆధునిక సాగు విధానాలను తెలియజేయడం, కూలీల కొరతను అధిగమించేందుకు వీలుగా యంత్రీకరణను వినియోగించడం, మార్కెటింగ్ మెలుకువలు, పసుపు పంట నాణ్యతను పెంపొందించే ప్రాసెసింగ్ విధానాలపై తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. ఈ దిశగా నిజామాబాద్ జిల్లాను ఎగుమతి కేంద్రంగా ప్రకటిస్తూ, పసుపు, వరి రైతులకు అవగాహన పెంపొందించేందుకు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మెగా ఒక రకంగా దేశానికి సేవ చేసినట్లు అవుతుందని సూచించారు. ప్రస్తుతం తెలంగాణ నుండి జొన్నలాలు, ఇంజినీరింగ్ విడి భాగాలు ఎక్కువగా విదేశాలకు ఎగుమతి జరుగుతున్నాయని, ఇదే కోవలో పసుపు, వరి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను కూడా అధిక మొత్తంలో ఎగుమతి చేయవచ్చని అన్నారు. ఫారిన్ ట్రేడ్ పాలసీని అనుసరిస్తూ విదేశీ ఎగుమతులకు ప్రభుత్వం తగిన రాయితీలు వర్తింపజేస్తూ, అనేక విధాలుగా ప్రోత్సహిస్తోందని అన్నారు. నేటి పరిస్థితుల్లో ఈ-కామర్స్ ప్రాధాన్యతను గుర్తెరిగి, అవగాహనను పెంపొందించుకోవాలని, తద్వారా తాము ఉంటున్న ప్రాంతం నుండే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ఉత్పత్తుల ఎగుమతులు, వ్యాపార లావాదేవీలు జరపవచ్చని సూచించారు. డీ.జీ.ఎఫ్.టీ ద్వారా జిల్లా రైతాంగానికి తగిన తోడ్పాటు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు అధికారులు కేవీఎస్.శైలజ, ప్రత్యూష్, వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు విద్య, కే.జనార్దన్ రెడ్డి, ఎ.పీ.ఈ.డీ.ఎ అధికారి నాయుడు, నాబార్డు డీ.జీ.ఎం ఎస్.ప్రవీణ్ కుమార్, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, రైతులు, ట్రేడర్లు పాల్గొన్నారు.

సిరిసిల్లాలో అక్రమ వడ్డీ వ్యాపారాలపై పోలీసుల తనిఖీలు



సిరిసిల్ల, బతుకమ్మ :సిరిసిల్లా జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ మహేష్ బిగితే ఆదేశాల మేరకు మంగళవారం ఫైనాన్స్, వడ్డీ వ్యాపారుల ఇండ్లలో, దుకాణాలలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ వడ్డీ, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై 6 కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తనిఖీలలో రూ.1,42,05,000 విలువ గల వివిధ డాక్యుమెంట్లు, రూ.1,77,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

భూ నిర్వాసితులతో గవర్నర్‌ను కలిసిన బీఆర్ఎస్ చీఫ్ కవిత

హైదరాబాద్, బతుకమ్మ :వెలుగుమట్ల, కడ్లాపూర్, ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసిత బాధితులతో తెరాస చీఫ్ కల్వకుంట్ల కవిత గవర్నర్ శివ ప్రతాప్ శుక్లను కలిసారు. మంగళవారం ఉదయం లోక్ భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా ని భూనిర్వాసితులతో కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లా డు తూ.. వెలుగుమట్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులందరికీ ఇం టి స్థలాలు కేటాయించాలని, పరిగి మండలం కడ్లాపూర్‌లో ఇండ స్ట్రి యల్ పార్క్ ఏర్పాటుకు జారీ చేసిన భూసేకరణ నోటీసులను రద్దు చేయాలని కోరినట్లు తెలిపారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పు ,భూ సేకరణ సమస్యలపై బాధితులతో కలిసి వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు.

ముందు వడ్లు మక్కలు కొనండి సార్...

మంత్రిని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్

విధుల నుంచి తొలగించినట్లు ప్రకటించిన ఆర్ఎం

జగిత్యాల, బతుకమ్మ:ఒక్కటే మాట ... ప్రభుత్వాన్ని ప్రశ్నించడం అతని ఉద్యోగానికి ఎసరు తెచ్చింది. చేసే బెంచరీ ఉద్యోగం నుంచి అతడిని తొలిగించడమే కాకుండా విధులకు రావద్దని ఖరాఖండిగా చేప్పేశారట....కేంద్రం పెంచిన ఇంధన ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర మంత్రి అడ్డూర్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు జగిత్యా ల జిల్లా కేంద్రంలో ధర్నా నిర్వహించారు. అదే సమయంలో అదే రూట్ లో బస్సు నడుపుతున్న జగిత్యాల ఆర్టీసీ డిపో హైర్ బస్ డ్రైవర్ అశోక్ ముందు వడ్లు, మక్కలు కొనండి సార్ పెట్రోల్, డిజిల్ ధరల పెరుగుదలపై తరువాత మాట్లాడోచ్చు అంటు కామెంట్ చేశారు. ఈ కామెంట్ ను సీరియస్ గా తీసుకోని ఆర్టిసి రీజినల్ మేనేజర్ కార్యాలయం నుంచి డ్రైవర్ అశోక్ కు రిమూవల్ సర్వీస్ అనే లేటర్ జారీ చేసి డ్యూటికి రావద్దని సూచించినట్లు తెలిసింది.. రైతులు కష్టాలు పడుర్కుంటుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు ముందుగా వడ్లు, మక్కలు కొనండి అని అడిగినందుకు అశోక్ ను ఉద్యోగం నుంచి తీసివేయడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుంది. అశోక్ పరిస్థితి చూసి అందరిలో అతడిపట్ల సానుభూతి వ్యక్తం అవుతుంది.

డ్రైవర్ అశోక్ తో ఫోన్లో మాట్లాడిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్

ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై వేటు వేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. మంగళవారం డ్రైవర్ అశోక్ ను పరామర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడం లేదని ప్రతి సామాన్య ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఉంటుందని, ఇలా ప్రశ్నించిన ప్రతి వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పేర్కొన్నారు. వెంటనే డ్రైవర్ అశోక్ ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే విషయం తెలుసుకున్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ స్థానిక నాయకుల సహకారంతో డ్రైవర్ అశోక్ తో సెల్ ఫోన్ ద్వారా మాట్లాడారు. పరిస్థితిపై పరిశీలన జరిపారు. పార్టీ తరపున, వ్యక్తిగతంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం ఏర్పాటు జరిగిన వెంటనే డ్రైవర్ అశోక్ ఉద్యోగాన్ని రెగ్యులరైజ్ చేస్తామని పేర్కొన్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని హామీనిచ్చారు